జేఎన్‌టీయూలో 'విచారణ కమిటీ' ఏర్పాటు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలో గత మూడు రోజులుగా విద్యార్థుల నడుమ జరుగుతున్న వివాదాలు దాడుల వరకు వెళ్లటంతో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవి నరసింహారెడ్డి స్పందించారు. బుధవారం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో సంబంధిత విభాగాల అధిపతులతో విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. వివాదాలకు గల కారణాలను తెలుసుకోవడానికి సీసీ పుటేజీలను పరిశీలించారు. హాస్టళ్లలో తిష్టవేసిన బయటి వ్యక్తులను గుర్తించి మూడు రోజులలోగా నివేదిక ఇవ్వాలని ప్రిన్సిపాల్ కమిటీ సభ్యులకు సూచించారు.

హాస్టల్ గదుల సమస్య లేదు...

వసతి గృహాల్లో విద్యార్థులకు సరిపడా గదులు లేవనడంలో వాస్తవం లేదని, మిగిలిన యూనివర్సిటీలతో పోల్చితే జేఎన్‌టీయూ హాస్టల్స్‌లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని ప్రిన్సిపాల్ 'సాక్షి'కి తెలిపారు. విద్యార్థుల నడుమ జరిగిన వివాదం తెలుసుకొని సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

ఆయుర్వేదం ప్రాచీన వైద్య విధానం

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కేపీహెచ్‌బీ వసంత్‌నగర్, ధర్మారెడ్డి కాలనీ ఫేజ్ 2లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో కలిసి మాధవ్‌బాగ్ క్లినిక్‌ను బుధవారం ప్రారంభించారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ ఆయుర్వేదం ప్రాచీన వైద్య విధానం అని ఇది ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. ఆధునిక వైద్యం వచ్చిన తరువాత కొంచెం వెనుకబడినా ప్రస్తుతం తిరిగి ప్రాచుర్యాన్ని సంతరించుకుందన్నారు. మాధవ్ బాగ్ క్లినిక్ గుండె జబ్బుల చికిత్సకు నమ్మదగిన ఎంపికగా స్థిరపడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, కాలనీవాసులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మాధవ్‌బాగ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఈటల రాజేందర్, రాజేశ్వరరావు తదితరులు

మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి ఆఫీసర్ నాగేశ్వరరావు

మూసాపేట: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విభూతి బ్రదర్స్ కళా జాత బృందం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్ బి నాగేశ్వరరావు మాట్లాడుతూ మట్టి విగ్రహం మహా విగ్రహం అని తెలిపారు. వినాయక చవితి పండుగకు మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. చెరువులను పరిరక్షించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మట్టితో గణపతి విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజి వైస్ ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉత్తర, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ముఖ్యం

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జై భారత్‌నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీవాసులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా ప్రణాళిక పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు కుమారస్వామి, ప్రసాద్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మేయర్‌కు వినతి



మేయర్ నీలారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

నిజాంపేట్: పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, రామచందర్‌లు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పాఠశాలలో అదనపు గదులు, విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు తదితర సదుపాయాలను కల్పించాలని కోరుతూ మేయర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆమె మాట్లాడుతూ అధికారుల బృందంతో పాఠశాలను సందర్శించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్‌లోని ఓంకారేశ్వర శివాలయం ద్వితీయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాయినేని చంద్రకాంత్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్, రాజేశ్వర్‌రెడ్డి మాయ రాజయ్య పాల్గొన్నారు.



విద్యా సౌధాల్లో సౌర వెలుగులు

విద్యుత్ బిల్లులు ఆదా చేస్తున్న హెచ్‌సీయూ

- 2013 నుంచి రూఫ్‌టాప్ సోలార్ పవర్ ఉత్పత్తికి శ్రీకారం
- దేశంలోనే మొదటి యూనివర్సిటీగా గుర్తింపు



హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ భవనంపై సోలార్ ఫలకాలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సోలార్ పవర్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. విద్యుత్ వ్యయాన్ని గణనీయంగా తగ్గించేందుకు పదకొండేళ్ల క్రితమే శ్రీకారం చుట్టడం విశేషం. క్యాంపస్‌లో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకునేలా సోలార్ పవర్ ఉత్పత్తిని మరింత పెంచేందుకు కూడా ప్రణాళికలు రూపొందించి ముందుకుసాగుతున్నారు. ప్రస్తుతానికి పరిమితంగా సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తిని చేస్తున్నా భవిష్యత్తులో పూర్తిగా వినియోగించుకునేలా అవసరమైన ప్రణాళికలను రచించి అందుకు తగిన అనుమతుల కోసం ఎదురుచూస్తున్నారు.

- హెచ్‌సీయూలో 2013లో రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌ను లాంఛనంగా ప్రారంభించారు.
- యూనివర్సిటీ పరిపాలనా భవనం, ఫైనాన్స్ బిల్డింగ్, హెల్త్ సెంటర్, సీఐఎస్ బిల్డింగ్, ఐజీఎం లైబ్రరీ, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ భవనాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి ఉత్పత్తి సాగిస్తున్నారు.



సోలార్ పవర్‌ప్లాంట్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ప్రొ.రామకృష్ణ (ఫైల్)

- సోలార్ పవర్ ఉత్పత్తికి సౌరఫలకాలు, ఇన్వర్టర్లు, మౌంట్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ భాగాలు వినియోగిస్తారు
- క్యాంపస్‌లో ప్రస్తుతం 1000 కెడబ్ల్యూపి సోలార్ పవర్ ఉత్పత్తికి ప్యానల్స్‌ను వినియోగిస్తున్నారు.
- హెచ్‌సీయూ క్యాంపస్ అంతటా ప్రస్తుతం ఈ సిస్టమ్ ద్వారా సరాసరి నెలకు 83,862.89 కెడబ్ల్యూహెచ్ ఉత్పత్తి చేస్తున్నారు.
- సూర్యకాంతి నుంచి ఫోటాన్లను సౌరఫలకాలు గ్రహించి ఈ కాంతిశక్తి సెమి కండక్టర్‌లో ఎలక్ట్రాన్‌లను ఉత్తేజపరిచి విద్యుత్ ప్రవాహాన్ని సృష్టిస్తుంది.
- ఆ తర్వాత ఇన్వర్టర్ల సహాయంతో ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను వినియోగించుకుంటారు.

విద్యుత్ బిల్లులను తగ్గించేందుకే ..

- క్యాంపస్‌లో విద్యుత్ వ్యయాన్ని తగ్గించేందుకే సోలార్ పవర్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు.
- హెచ్‌సీయూలో విద్యుత్ బిల్లును నెలకు రూ.7.36 లక్షల వ్యయాన్ని తగ్గిస్తోంది.
- భవిష్యత్‌లో మరిన్ని భవనాలకు సోలార్ పవర్ ఉత్పత్తి చేయాలనే ప్రణాళిక ఉంది
- భారతదేశంలోనే 100 కేడబ్ల్యూ సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన మొదటి విశ్వవిద్యాలయ లైబ్రరీగా హెచ్‌సీయూ గుర్తింపు పొందింది. 1988 అక్టోబర్ 21న అప్పటి ఉపరాష్ట్రపతి శంకర్ దయాళ్‌శర్మ ప్రారంభించారు.
- ఈ సోలార్ పవర్ ప్లాంట్ 1.14 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేశారు.దీన్ని రికార్డుస్థాయిలో కేవలం 30 రోజులలో ఏర్పాటు చేయడం మరో విశేషం.
- ఏడాదికి 21,11,358 కిలోవాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి చేయాలని సంకల్పించారు.
- లైబ్రరీ తన అంతర్గత కార్యకలాపాలన్నింటినీ కంప్యూటరీకరించిన మొదటి లైబ్రరీ. భారతదేశంలో ఎలక్ట్రానిక్ జర్నల్‌లు, డేటాబేస్‌లకు సభ్యత్వాన్ని పొందింది.



పదేళ్లు గడిచినా ఇప్పటికీ విజయవంతంగా ఈ ప్లాంట్ కొనసాగడం విశేషం.

- భవిష్యత్తులో క్యాంపస్‌లో మరిన్ని భవనాలపై కూడా సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

స్వాగతం పలికేందుకు తరలిన నేతలు



ఓల్డ్‌బోయినపల్లి: లిక్కర్ పాలసీ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో సంబురాలు జరుపుకున్నారు. ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు బుధవారం కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో హరినాథ్, రాజుగౌడ్, పోచయ్య, ఐలేష్, దేవేందర్, రాజు, బాలరాజు, లలిత, ఉమా, కొండమ్మ, పద్మక్క, సునీతమ్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి కల్యాణం

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ వేంకటేశ్వరనగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం నేడు నిర్వహించనున్నట్లు అర్చకులు కలకోట రామాచార్యులు తెలిపారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి హోమం, అర్చనలు, అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, అన్నదానం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆలయ ప్రథమ వార్షికోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజులోని విజయ గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు హాజరయ్యారు. గణపతి హోమం, పాలాభిషేకం, పుష్పార్చన, శాంతి కల్యాణం నిర్వహించారు.



పనులను పరిశీలించిన కార్పొరేటర్



గుంతలను చదును చేయిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మ చెరువు పక్కన జయానగర్ కాలనీకి వెళ్లే మట్టి రోడ్డు చదును చేస్తున్న పనులను బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో డ్రైనేజీ నిర్మాణ పనులు, రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో వాహనదారులను జయానగర్ రోడ్డుకు దారి మళ్లించి పంపించడం జరుగుతుందన్నారు. దీంతో జయానగర్ రోడ్డు గుంతలు పడి ఉండటంతో వాహనదారుల విజ్ఞప్తి మేరకు గుంతల రోడ్డును చదువు చేసి లెవెలింగ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, ధాతి రమేష్, ఫారూఖ్, ఖలీం, సత్తార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విటమిన్-డీ లోపంతోనే వెన్ను, మెడ నొప్పులు

అమీర్‌పేట: విటమిన్-డీ లోపంతోనే వెన్ను, మెడ నొప్పులు వస్తాయని ప్రముఖ స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు ప్రొఫెసర్ మేజర్ డాక్టర్ భక్తియార్ చౌదరి అన్నారు. అమీర్‌పేట గ్రీన్‌పార్క్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెన్ను నొప్పికి గల కారణాలను ముందుగానే గుర్తించి చికిత్స చేయించుకోవాలని లేకుంటే రోజువారి కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ప్రతీ చిన్న సమస్యకు శస్త్ర చికిత్సల వరకు వెళ్లడం మంచిది కాదన్నారు. జనన లోపాలు, పార్శ్వగూని, కేన్సర్లు, కణితులు, గాయం వంటి సమస్యలకు చిన్నపాటి శస్త్ర చికిత్సలు అవసరమన్నారు. దేశ వ్యాప్తంగా 20-50 ఏళ్ల లోపు స్త్రీలలో 79 శాతం మంది దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రధానంగా సమయానికి ఆహారం తీసుకోవాలని, సూర్యరశ్మి శరీరానికి తగిలేటట్లు చూసుకోవాలన్నారు. ఆహారం ద్వారా 20, సూర్యరశ్మి ద్వారా 80 శాతం డీ-విటమిన్ లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి విజయరావు, వెన్నునొప్పి బాధితురాలు శాంతివాసి రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధి నిజాంపేట్‌కు చెందిన తిమ్మయ్య కుమార్తె బత్తిని గాయత్రికి కాకతీయ సేవా సమితి కూకట్‌పల్లి ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరానికి కళాశాల ఫీజు 29 వేల రూపాయల చెక్కును బుధవారం ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. కాకతీయ మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్ సీటు వచ్చిన సందర్భంగా గాయత్రి చదువుకు ఎటువంటి ఆటంకం కలగకూడదని ఫీజులు చెల్లించామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసదాసు, గాంధీ, ఆనంద్, విద్యార్థిని తండ్రి తిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

డెంగీ.. డేంజర్ బెల్స్

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో 394 డెంగీ కేసులు
- మున్సిపల్ సర్కిళ్లు, పురపాలక సంఘాల్లోనే అధికం
- 30 రోజుల వ్యవధిలో బస్తీ, పట్టణాల్లో 232 కేసులు
- ఫీవర్ సర్వేలో వైద్యశాఖ గుర్తించిన జ్వర పీడితులు 8,742 మంది

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో డెంగీ డేంజర్ బెల్ మోగిస్తోంది. జిల్లాలో చాపకింద నీరులా విస్తరిస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లు, పురపాలక సంఘాలు, బస్తీల్లో దోమల బాధలు భరించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగర శివారుల్లో చాపకింద నీరులా డెంగీ విజృంభిస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 394 డెంగీ కేసులు నమోదు కాగా, టైఫాయిడ్, చికెన్ గున్యా, విషజ్వరాలకు సంబంధించిన కేసులు స్వల్పంగా నమోదయ్యాయి. వర్షాలతో దోమలు విజృంభిస్తుండటంతో డెంగీ కేసులు పెరుగుతున్నట్లు పేర్కొంటున్నారు. పల్లెల్లో మాత్రం విషజ్వరాలు, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు వంటి జబ్బులు పెరుగుతున్నాయి. బస్తీలు, పురపాలికలు, పల్లెల్లో బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు లభించకపోవడంతో నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు పరిగెడుతున్నారు. పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దీంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. జిల్లాలో జులై చివరి వారం నుంచి ఇప్పటి వరకు 232 డెంగ్యూ కేసులు నమోదు కావడంతో.. ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మేడ్చల్ మండలం రావల్‌కోల్‌లో 40 రోజుల కిందట ఒక వ్యక్తి డెంగ్యూతో మృతి చెందడంతో పల్లెల్లో దోమల నివారణ, పరిశుభ్రతపై జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది.

జ్వర పీడితులు 8,742 మంది..

మేడ్చల్ జిల్లాలో 15 మండలాల పరిధిలో జులై 5 నుంచి బుధవారం వరకు ఇంటింటి ఫీవర్ సర్వేలో భాగంగా 3,71,514 ఇళ్లను విజిట్ చేసిన వైద్య సిబ్బంది.. ఇందులో 13,37,450 మంది నుంచి రోగ నిర్ధారణ వివరాలు సేకరించారు. ఈ నేపథ్యంలోనే 8,742 మంది ప్రజలు జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించటంతో పాటు వారికి మందులు(మెడిసిన్) అందజేశారు. ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ సిబ్బంది వ్యాధుల కారకాలైన దోమలు, అపరిశుభ్రత, ఆహారం, పరిసరాల పరిశుభ్రత, నీటి శుభ్రతపై ప్రజల్లో విస్తతంగా ప్రచారం చేస్తున్నారు.

వాతావరణ మార్పులతో..

ఒక రోజులోనే ఎండ కాయడం, కొన్ని గంటలకు వర్షం కురవడం, మరికాసేపటికే చల్లని గాలులు వీయడం వంటివి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒంట్లో రోగ నిరోధకశక్తి తక్కువ ఉన్న వారు త్వరగా వ్యాధుల బారిన పడుతున్నారు. నిత్యం పోషకాహారం తీసుకుంటూ సరైన శారీరక వ్యాయామం చేసే వారు మాత్రం వీటిని ఎదుర్కొంటున్నారు. వ్యాధి బారిన పడిన వారిలో సగం మంది జ్వరం, గొంతు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు.

దోమల నియంత్రణపై..

జిల్లావ్యాప్తంగా వర్షాలు కురవడంతో బస్తీ, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పలుచోట్ల వర్షపు నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారింది. దోమల నియంత్రణకు ఫాగింగ్ వంటి చర్యలతో పాటు వైద్య ఆరోగ్యశాఖ పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

అత్యధిక కేసులు ఇక్కడే..

జీహెచ్‌ఎంసీ సర్కిళ్లు, పురపాలక సంఘాల్లో అత్యధిక డెంగీ కేసులు నమోదవుతున్నాయి. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎక్కువగా డెంగీ కేసులు నమోదయ్యాయి. వైరల్ ఫీవర్ వంటి రోగాలు తీవ్రంగా ప్రబలుతుండటంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో చిన్న, పెద్ద పరిశ్రమలతో పాటు ఉపాధి మెండుగా ఉండటంతో వలస ప్రజలు కూడా అధికంగా నివస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేట్ ఆస్పత్రులు పరీక్షలు, వైద్య సేవల పేరుతో అందినకాడికి దోచుకుంటున్నాయి.

వ్యాధులు ప్రబలేందుకు..

జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతం ఉండటంతో పాటు కూకట్‌పల్లి, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిళ్లలో బస్తీలతో పాటు బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడ్చల్ మున్సిపల్ పట్టణాల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్యం, చెత్తాచెదారంతో దోమలు స్వైర్వవిహారం చేస్తున్నాయి. వాటి నివారణకు ఫాగింగ్ యంత్రాలతో పొగ వెదజల్లక పోవడంతో ప్రజలు రోగాలకు గురవుతున్నారు. పురపాలికల్లో అభివృద్ధి పర్యవేక్షణ కమిషనర్లదే అయినా పట్టించుకోవడం లేదు. గ్రామీకవాడల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్యం, కాలుష్యం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

మీ సేవ కేంద్రంలో అగ్ని ప్రమాదం



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని మీ సేవ సెంటర్‌లో కాలిపోయిన ఫర్నిచర్

మూసాపేట: మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న మీ సేవ సెంటర్‌లో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. కంప్యూటర్, టేబుల్స్, కొన్ని దస్తావేజులు కాలిపోయాయి. రాత్రి 12 గంటల సమయంలో రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి మంటలు వ్యాపించటంతో వాచ్‌మెన్ గమనించి కార్యాలయం సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయటంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ కార్యాలయంలో వరుసగా దస్తావేజు పత్రాల దుకాణాలు ఉంటాయి. మిగిలిన దుకాణాలకు మంటలు వ్యాపిస్తే నష్టం జరిగేది. అయితే ప్రతి రోజు కార్యాలయం బయట గ్రిల్స్ ఉంటాయి. ప్రతి రోజు తాళం వేసి వెళ్లేవారు. కాగా మంగళవారం తాళం వేయకపోవటంతో అగ్నిమాపక సిబ్బంది త్వరగా లోపలికి వెళ్లి మంటలను అదుపులోకి తేగలిగారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు



మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్లు

ఆల్విన్‌కాలనీ: సుప్రీంకోర్టు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ ఇవ్వటంపై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు, పోస్టులు పెట్టి కించపరుస్తున్నారంటూ బీఆర్‌ఎస్ మహిళా కార్పొరేటర్‌లు మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి ఈ సందర్భంగా కంప్లయింట్ ఫిర్యాదు ప్రతిని చూపారు.

నూతన భవనం ప్రారంభం



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న యాదవ సంఘం నాయకులు

మూసాపేట: మూసాపేటలోని మల్లన్న స్వామి ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతన భవనాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు , ఆలయ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

24న పీడీఎస్‌యూ 50వ ఆవిర్భావ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో పీడీఎస్‌యూ 50వ ఆవిర్భావ సభను నిర్వహించనున్నారు. అక్టోబరు 24న రెండు పీడీఎస్‌యూల ఆధ్వర్యంలో జరిగే సభకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని విద్యార్థి నేతలు నాగరాజు, మహేష్ తెలిపారు. నవంబరులో సీపీఐఎంఎల్-న్యూ డెమోక్రసీ రెండు విప్లవ పార్టీలు ఏకం అవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విప్లవ పార్టీలకు అనుబంధంగా పని చేస్తున్న రెండు పీడీఎస్‌యూలు ఐక్యత దిశగా కొనసాగుతూ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు.